సాక్షి
వికారాబాద్
ఆదివారం । 12 । జనవరి । 2025



పర్మిషన్ కొంత

సహజ సంపదను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. అరకొర అనుమతుల పేరిట కొండలను పిండిచేస్తున్నారు. 8లో▸



గొంతు కోస్తున్న మాంజా

గాలిపటాలను ఎగురవేసేందుకు ఉపయోగించే చైనా మాంజా మనుషులు, జంతువుల ప్రాణాలకు ముప్పుగా మారింది. 8లో▸



చెరకు రైతుకు చేదు

అందరికీ తీపిని పంచే చెరకు.. పండించిన రైతులకు చేదును మిగుల్చుతోంది. మద్దతు ధర లేక నష్టాలను మిగుల్చుతోంది. 9లో▸

న్యూస్‌రీల్

కుంగ్‌ఫూ మాస్టర్‌కు నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న మాస్టర్ అహ్మద్‌ఖాన్

షాద్‌నగర్: పట్టణానికి చెందిన న్యూ పవర్ కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన ఎండీ మాస్టర్ అహ్మద్‌ఖాన్ నంది అవార్డు అందుకున్నారు. వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారికి తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నంది అవార్డులను ఇస్తున్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గాన సభలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువకులకు కరాటే, కుంగ్‌ఫూలో శిక్షణ ఇస్తున్న షాద్‌నగర్ పట్టణానికి చెందిన అహ్మద్‌ఖాన్ అవార్డుకు ఎంపిక అయ్యారు. సాహితీ వేదిక సభ్యులు ఆయనకు అవార్డుతో పాటు ధ్రువపత్రం అందజేసి సత్కరించారు.

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుల్లేర్‌బోడ్‌తండాకు చెందిన శ్రీను నాయక్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఆలయ నిర్వాహకులు లక్ష్మారెడ్డి, సహజ కవి డేగ బాలరాజుయాదవ్, ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, మాజీ సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా సుగుణ



నియామకపత్రం అందుకుంటున్న సుగుణ

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఎం.సుగుణ నియమితులయ్యారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు తగిన న్యాయం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. సమాజంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ జాతీయ మహిళా అధ్యక్షురాలు అల్కలాంబ, పార్టీ నేతలు కేఎల్లార్, చల్లా నర్సింహారెడ్డి, చిగురింత పారిజాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

‘పట్టుతప్పిన’ ప్రాణం



తీగలపై వేలాడుతున్న గుల్ఫాన్ మృతదేహం

పహడీషరీఫ్: నూతన భవనానికి పీఓపీ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్) పనులు చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన మహ్మద్ గుల్ఫాన్(23) కొంతకాలం క్రితం బోరబండ ప్రాంతానికి వలస వచ్చాడు. బాలాపూర్‌లోని సాదత్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంట్లో గుల్ఫాన్ ఇవరై రోజులుగా పీఓపీ పనులు చేస్తున్నాడు. ఇందులో భాగంగా శనివారం ఇంటి మొదటి అంతస్తు ముందు భాగంలో ఏర్పాటు చేసిన తడకలపై మరో ఇద్దరితో కలిసి పనిచేస్తుండగా అదుపుతప్పి 11కేవీ విద్యుత్ వైర్లపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి కార్మికులు చూస్తుండగానే ప్రాణాలు కోల్పోయాడు. గమనించిన స్థానికులు బాలాపూర్ పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఈ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చదువులో పోటీ.. ఆటల్లో మేటి



వీరంతా తెలంగాణ గురుకుల పాఠశాలలో చదువుతున్న నిరుపేద బాలికలు. విద్యలో తమకుతామే సాటిగా నిలుస్తూ.. జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటుతున్నారు. శివంగిలా చెలరేగుతూ.. ప్రత్యర్థులను మట్టికరిపించి, పతకాల పంట పండిస్తున్న వారిపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం..

- గురుకుల విద్యార్థినుల ప్రతిభ
- జాతీయస్థాయి క్రీడల్లో పతకాల పంట
- ఆల్ రౌండర్లుగా రాణిస్తున్న తాండూరు బాలికలు

సండే స్పెషల్



తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, తాండూరు

తాండూరు: తాండూరు పట్టణ శివారులోని ఖంజాపూర్‌లో తెలంగాణ గురుకుల పాఠశాల 23 ఏళ్లుగా కొనసాగుతోంది. 480 మంది విద్యార్థినులతో ప్రారంభమై.. నేడు 640 మంది విద్యాకుసుమాలతో కళకళలాడుతోంది. ఇక్కడ అన్ని వర్గాల బాలికలు చదువులో ఉత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా.. ఆటలో ఔరా అనిపిస్తున్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలో బహుమతులు సాధిస్తున్నారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ కేటగిరీల్లో మేటిగా నిలుస్తున్నారు.

ప్రజాప్రతినిధుల ప్రోత్సాహం

బాలికలు ఆటల్లో రాణించేందుకు తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రికె విజయలక్ష్మి.. తనవంతుగా పాఠశాల ప్రాంగణంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయించారు. నాటి నుంచి విద్యార్థినులు నిరంతరం చెమటోడుస్తూ.. పతకాల వెంట పరుగు తీస్తున్నారు. వీరికి పాఠశాల నిర్వాహకులు, స్వచ్ఛంద కార్యకర్తలు అండగా నిలుస్తున్నారు.

ఫలితాలు.. వివరాలు

గురుకుల పూర్వ విద్యార్థినుల్లో పది మంది వైద్యులుగా కొనసాగుతున్నారు. 15 మంది ఇంజినీర్లుగా, మరో 10 మంది ఉపాధ్యాయులుగా రాణిస్తున్నారు. పోలీసుశాఖ, శాస్త్రవేత్తలుగా, పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖల్లో ఉద్యోగాలను సాధించారు. ఐఐటీకి ఎంపికయ్యారు. కొందరు ఐఏఎస్‌కు సిద్ధమవుతున్నారు. 2014–15లో తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ వికారాబాద్‌లో జరిగిన పోటీల్లో ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచి 26 బహుమతులు కైవసం చేసుకున్నారు. అథ్లెటిక్స్‌లో వ్యక్తిగత ఛాంపియన్‌గా శ్రీలత.. అండర్ 14లో మొదటి బహుమతి, స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ జిల్లా మీట్ యాలాలలో జరిగిన టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచారు. 2015 ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన తెలంగాణ గురుకుల స్టేట్ మీట్‌లో కబడ్డీ, ఖోఖో, షటిల్, త్రోబాల్, అథ్లెటిక్స్, లాంగ్ జంప్, హై జంప్‌లలో ప్రథమ, ద్వితీయంగా నిలిచారు. 2016–17లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన స్టేట్ స్పోర్ట్స్ మీట్‌లో 20 పతకాలు పొందారు. అదే ఏడాది గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఇంటర్ సొసైటీ లీగ్‌లో 200, 400, 800, 1500 అథ్లెటిక్స్‌తో పాటు పలు విభాగాల్లో 26 బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. 2017–18లో కరీంనగర్ జిల్లా తెలంగాణ స్పోర్ట్స్ మీట్‌లో 18 పతకాలు, విద్యార్థి శ్రీలత హర్యానాలో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచింది. మరో విద్యార్థి అఖిల ఖోఖోలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. 2018లో ఇంటర్ సొసైటీ లీగ్‌లో 11 బంగారు పతకాలు, వ్యక్తిగతంగా గురుకుల విద్యార్థులు క్రీడల్లో ఓవరాల్‌గా ఛాంపియన్‌గా నిలిచారు. 2019లో 8 గురుకుల పాఠశాలల నుంచి 80 మంది నేషనల్ పోటీలకు వెళ్లారు. 2021–22లో బాలిక రుక్మిణి.. ఖోఖోలో జాతీయ స్థాయిలో రాణించి.. మలేషియాలో జరిగిన అంతర్జాతీయ పోటీలకు వెళ్లింది.



డాక్టర్ భాగ్యలక్ష్మి, పూర్వవిద్యార్థిని



ఆణిముత్యాలు

దశాబ్ద కాలంగా గురుకుల సొసైటీ క్రీడా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్‌గా నిలుస్తున్నారు. ఇటీవల గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఇంటర్ సొసైటీ ఛాంపియన్ షిప్ లీగ్‌లో ఆణిముత్యాల్లా మెరిశారు. పసిడి పతకాలు ఒడిసిపట్టారు. ఖోఖోలో రాష్ట్ర స్థాయిలో కెప్టెన్‌గా వ్యవహరించి పతకాన్ని కైవసం చేసుకున్నారు.

వసతులు లేకున్నా..

అరకొర వసతుల నడుమ పీఈటీ, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఉన్నంతలోనే బాలికలు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. నిత్యం ఉదయం 5 గంటల నుంచి గంట పాటు, సాయంత్రం మరో గంట చొప్పున కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, జావెలింగ్ త్రో, లాంగ్ జంప్, హై జంప్, అథ్లెటిక్స్ తదితర క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. వీరి ప్రతిభను చూసిన తల్లిదండ్రులు మరింత ప్రోత్సాహం అందజేస్తున్నారు.



అన్ని రంగాల్లో రాణించాలి



బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి. అందుకు ప్రభుత్వ ప్రోత్సాహం చాలా అవసరం. ప్రస్తుతం గురుకులంలో చదువుతున్న వారు.. జాతీయస్థాయి ఆటల్లోనూ గుర్తింపు సాధించారు. చదువు పూర్తయిన వారిలో చాలా మంది వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు.

– కేవీఎం వెంకట్, సామాజిక కార్యకర్త, తాండూరు

పాఠశాల కీర్తిని పెంచారు



రెండు దశాబ్దాలుగా బాలికలు చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. జాతీయస్థాయి క్రీడల్లో పతకాల పంట పండిస్తూ.. పాఠశాల కీర్తిని జాతీయస్థాయికి పెంచారు. భవిష్యత్‌లో వారిని మరింత నిష్ణాతులుగా మారుస్తాము.

– ప్రవీణారెడ్డి, ప్రిన్సిపాల్, తెలంగాణ గురుకుల పాఠశాల

పారదర్శకంగా అర్హుల ఎంపిక

- సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించండి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులకు అవగాహన సమావేశం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాళ్లు, రప్పలతో కూడిన భూములకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయబోమని, కేవలం సాగుకు యోగ్యంగా ఉన్న భూములకే ఈ పథకాన్ని వర్తింపజేస్తామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ అంశాలపై శనివారం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు, అర్హుల ఎంపికలో ఎమ్మెల్యేలు, ఎంపీల సూచనలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేసే పైపథకాల అర్హుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. గ్రామ, మున్సిపల్ స్థాయిలో సభలు, సమావేశాలు నిర్వహించి అర్హుల జాబితాను వెల్లడించాలని సూచించారు.

ఉగాది నుంచి సన్న బియ్యం

పౌరసరఫరాల విభాగం ద్వారా వచ్చే ఉగాది నుంచి పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా భూమిలేని వ్యవసాయ కూలీలకు రెండు విడతలుగా రూ.12,000 అందజేయనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు అవకాశం ఇవ్వాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వ భూమిలో రాజీవ్ స్వగృహ తరహాలో పది అంతస్తుల భవనం నిర్మించి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని, సన్నవడ్ల బోనస్ రూ.500 బ్యాంకు ఖాతాలో జమ కాలేదని పలువురు ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే లీడ్ బ్యాంక్ అధికారికి వివరాలు ఇచ్చి ఆయా రైతుల ఖాతాలో నగదు జమ అయ్యే విధంగా చూడాలని ఉమ్మడి జిల్లా కలెక్టర్లకు సూచించారు.

21నుంచి అర్హుల జాబితా ప్రకటన

రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. పైనాలుగు పథకాలకు సంబంధించి ఈ నెల 11 నుంచి 13 వరకు షెడ్యూలు తయారు చేస్తామని, 16 నుంచి 20 వరకు ఆయా శాఖల బృందాలు అర్హులను గుర్తిస్తారని తెలిపారు. 21 నుంచి 24 వరకు ఆయా గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో అర్హుల జాబితాను ప్రకటిస్తామని స్పష్టంచేశారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతు భరోసా, రేషన్ కార్డుల అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డుల ఆధారంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగారపు దయానంద్, శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, వీర్లపల్లి శంకర్, ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్స్ కమిషనర్ కె.శశంక, మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పొట్రు, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, మూడు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన ఎంపీ, ఎమ్మెల్యేలు

పండగ పూట.. ఇంటి బాట

సంక్రాంతిని పురస్కరించుకుని నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు సొంతూళ్లకు వెళ్లేందుకు బారులు తీరారు. శనివారం ఉదయం నుంచే ఆంధ్రాకు వెళ్లేందుకు తమ వాహనాల్లో విజయవాడ జాతీయ రహదారిపై పోటీ పడ్డారు. పెద్దఅంబర్‌పేట్ వద్ద కిలోమీటర్ల మేరకు వాహనాలు బారులు తీరాయి. ఒక పక్క జాతీయ రహదారి విస్తరణ జరుగుతుండగా మరో పక్కన వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ పోలీసులు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను క్లియర్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. – అబ్దుల్లాపూర్‌మెట్



పెద్దఅంబర్‌పేటలో విజయవాడ హైవేపై బారులుతీరిన వాహనాలు



బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రజలు

ప్రైవేటు ప్రయాణమే దిక్కు!

- సొంతూర్లకు వెళ్లేందుకు బస్సులు లేక అవస్థలు
- చేవెళ్ల బస్‌స్టేషన్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు
- గంటల తరబడి నిరీక్షణ

చేవెళ్ల: సంక్రాంతి పండుగ వేళ సొంతూర్లకు వెళ్లేందుకు జనాలు నానా అగచాట్లు పడుతున్నారు. సరిపడా బస్సులు లేక ప్రయాణ ప్రాంగణాల్లో పడిగాపులు కాస్తున్నారు. వరుస సెలవులతో వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు, మరోపక్క వలసజీవులు గ్రామాల బాట పట్టారు. దీనికి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. శనివారం చేవెళ్ల బస్‌స్టేషన్ ఉదయం నుంచి రాత్రి వరకు జనంతో కిక్కిరిసిపోయింది. గంటల తరబడి నిరీక్షించినా బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేక బస్సులను వేస్తున్నట్లు ప్రకటించినా.. ఎక్కడా అలాంటి ఏర్పాట్లు లేవని ప్రయాణికులు మండిపడ్డారు. చేవెళ్ల పరిసరాల్లో ఎక్కువగా గురుకుల పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలు ఉండడంతో పండుగ సెలవులకు ఊళ్లకు వెళ్లేందుకు బయలు దేరారు. దీంతో పాటు వలస కూలీలు, ఇతర పనుల కోసం వచ్చిన వారు గ్రామాలకు వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు కావటంతో ఒక్కసారిగా రద్దీ పెరిగింది.

సమయానికి రాని బస్సులు

చేవెళ్ల బస్‌స్టేషన్‌లో విద్యార్థులు, వారిని తీసుకు వెళ్లేందుకు వచ్చిన కుటుంబ సభ్యులతో సందడి మారింది. దీనికి తోడు రెగ్యూలర్‌గా వచ్చే బస్సులు కూడా సమయానికి రాకపోవటంతోపాటు, వచ్చిన కొన్నింటిలోనే సీట్లు ఖాళీ లేవు. ప్రతి బస్సులో కూర్చోవటం కాదు, కనీసం నిలబడేందుకు కూడా స్థలం లేకుండా పోయింది. ప్రభుత్వం కూడా ప్రైవేటు వ్యాపారం లాగానే పండుగకు ప్రత్యేక బస్సుల పేరుతో రెగ్యూలర్‌గా వచ్చే వాటికే స్టిక్కర్లు వేసి అధిక చార్జీలు వసూళ్లు చేశారని ప్రయాణికులు వాపోయారు. చిన్నపిల్ల లు, వృద్ధులు, మహిళలు బస్సులు ఎక్కేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. కొంతమంది ప్రైవేటు వా హనాల్లో ప్రయాణం చేసి అధిక చార్జీలతో జేబులు ఖాళీ చేసుకున్నారు. ఆర్టీసీ అధికారులు సరిపడా బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రైతు భరోసాకు కసరత్తు

- విధివిధానాలు ప్రకటించిన ప్రభుత్వం
- జిల్లాలో భూ విస్తీర్ణం 12.35 లక్షల ఎకరాలు
- నగటున సాగుభూమి 5.5 లక్షలు ఎకరాలు
- గతంలో ఒక్కో పంటకు ఇచ్చిన రైతుబంధు రూ.310 కోట్లు
- సాగు యోగ్యత భరోసాతో.. సగానికి తగ్గే అవకాశం

వికారాబాద్: ప్రభుత్వం రైతుభరోసా ఇచ్చేందుకు సూచనాప్రాయంగా విధివిధానాలు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం, మంత్రులు పాలనాధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్లు, అధికారులు కసరత్తు షురూ చేశారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు రైతుభరోసాకు కావాల్సిన ప్రాథమిక సమాచారం సిద్ధం చేసి పెట్టుకోగా.. ప్రస్తుత విధివిధానాలపై ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

రూ.330 కోట్ల వరకు..

జిల్లా పరిధి ఇరవై మండలాల్లో 12.35 లక్షల వ్యవసాయ భూమి ఉండగా, 2,68,107 మంది రైతులు ఉన్నారు. ఇందులో ఏటా ఖరీఫ్‌లో సగటున 5.5 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. గతంలో పండించిన భూములతో పాటు.. సాగు చేయని భూములు, నాలా కన్వర్షన్, వ్యవసాయ యోగ్యం కాని భూములు, ప్లాట్లుగా మారిన భూములకు సైతం రైతుబంధు రైతు ఖాతాల్లో జమ అయింది. దీంతో ఏటా ప్రతి పంట, ఎకరాకు రూ.5వేల చొప్పున సగటున 6 నుంచి 6.5 లక్షల ఎకరాల భూమికి రూ.300 కోట్ల నుంచి 320 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమ అయ్యేది. ప్రస్తుత ప్రభుత్వం రైతుభరోసా పేరుతో ఎకరానికి రూ.6వేల చొప్పున రెండు పంటలకు రూ.12 వేలు జమ చేయాలనుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పంటలు సాగవుతున్న 5.5 లక్షల ఎకరాల భూమికి మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి వస్తే ప్రతి పంటకు రూ.330 కోట్ల వరకు జమ చేయాల్సి ఉంటుంది.

అధికారుల తర్జనభర్జన

రైతుభరోసా ఎవరికి ఇవ్వాలనే విషయంలో విధివిధానాలు ప్రకటించిన ప్రభుత్వం.. ఇందుకు కసరత్తు చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో రైతుభరోసాకు లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని స్పష్టతనిచ్చినట్లయింది. గతంలో సాగుతో సంబంధం లేకుండా అన్ని రకాల భూమికి రైతుబంధు అందించారు. ఇప్పుడు సాగుకు యోగ్యమైన భూమికి మాత్రమే సాయం ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో కోత విధించనున్నారనేది స్పష్టతమవుతోంది. ఎవరికి కోత పెట్టాలి? సర్వే ఎలా చేయాలి? లబ్ధిదారులను ఎలా గుర్తించాలి?, గుర్తిస్తే ప్రధానంగా పెద్ద రైతులు, సాగు చేయకుండా వదిలేసిన వారి నుంచి వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఎలా ముందుకు వెళ్లాలనే విషయంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.



నాడు రూ.10వేలు.. నేడు రూ.12వేలు

బీఆర్ఎస్ హయాంలో.. రైతుబంధు పేరిట ప్రతి పంటకు, ఎకరానికి రూ.5 వేల చొప్పున ఏడాదిలో రెండు పంటకు కలిపి రూ.10 వేలను రైతుల ఖాతాలో జమ అయ్యేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం.. రైతుభరోసా పేరుతో అదే పథకాన్ని అమలు చేయనుంది. ఏడాదికి రూ.6 వేల చొప్పున, ఏడాదికి రూ.12 వేలు రైతుల ఖాతాల్లో వేయనుంది. గత ప్రభుత్వం.. జిల్లాలో ఉన్న మొత్తం భూమికి సాగుసాయం ఇవ్వగా.. ప్రస్తుత ప్రభుత్వం సాగుకు యోగ్యమైన భూమికి మాత్రమే భరోసా ఇస్తామని స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో రైతుల ఖాతాల్లో జమ కావాల్సిన సాయం భారం తగ్గనుంది.

మండలాల వారీగా జిల్లాలో రైతులు, వ్యవసాయ భూముల వివరాలు

మండలం	రైతులు	ఎకరాలు లక్షల్లో
బొంరాస్‌పేట్	11,843	0.52
దౌల్తాబాద్	17,647	0.81
ద్యుల్	10,121	0.46
కొడంగల్	15,343	0.85
చౌడాపూర్	7,838	0.31
దోమ	14,319	0.61
కుల్కచర్ల	10,691	0.47
పరిగి	17,426	0.77
పూడూరు	16,531	0.74
బషీరాబాద్	13,209	0.75
పెద్దేముల్	13,708	0.71
తాండూరు	12,805	0.70
యాలాల్	13,160	0.64
బంట్వారం	7,024	0.36
దారూరు	14,165	0.60
కోట్‌పల్లి	8,751	0.40
మర్పల్లి	16,638	0.76
మోమిన్‌పేట్	13,591	0.56
నవాబుపేట	16,053	0.61
వికారాబాద్	17,344	0.72

క్లుప్తంగా

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పనిచేయండి



మహేశ్‌గౌడ్‌తో సుధాకర్‌రెడ్డి

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి శనివారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అధ్యక్షుడు సూచించినట్లు తెలిపారు.

పిల్లలపై నిఘా ఉంచాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్

తాండూరు టౌన్: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా పెద్దలు నిఘా పెట్టాలని ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ అన్నారు. నిషేధిత గంజాయిని విక్రయించడంతో పాటు.. వినియోగిస్తున్న పలువురు యువకులు, వారి తల్లిదండ్రులకు శనివారం తాండూరు ఎక్సైజ్ పోలీసులు.. సీఐ నేతృత్వంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం ఆగమవుతుందని, నేరప్రవృత్తి పెరుగుతుందని తెలిపారు.

కండక్టర్ సంచిలోని నగదు అపహరణ

బొంరాస్‌పేట: ప్రయాణికుడి ముసుగులో ఉన్న ఓ దొంగ.. కండక్టర్ సంచిలోంచి నగదును అపహరించాడు. ఈ సంఘటన శనివారం పరిగి డిపోనకు చెందిన ఏపీ21 జెడ్0407 బస్సులో చోటుచేసుకుంది. ఆర్టీసీ సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో మెహదీపట్నం నుంచి కొడంగల్‌కు అధిక ప్రయాణికులతో బస్సు బయలు దేరింది. మెహిదీపట్నం ప్రాంతంలో సాధారణ ప్రయాణికుడిలా బస్సు ఎక్కిన దొంగ.. కండక్టర్ బ్యాగులో ఉన్న రూ.4,800ల నగదును కొట్టేశాడు. ఇది గుర్తించిన సదరు కండక్టర్.. చేవెళ్ల పోలీసుస్టేషన్ వద్ద బస్సును నిలిపి సోదా చేయగా.. అప్పటికే దొంగ పారిపోయినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



బందమ్మ మృతదేహం

కుల్కచర్ల: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పుట్టపహడ్ గ్రామానికి చెందిన బందమ్మ(55) శుక్రవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో పొలం నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో పుట్టపహడ్ నుంచి అనంతసాగర్‌కు బైక్‌పై వెళ్తున్న వడ్డె నవీన్.. బందమ్మను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు ఆమెను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చైనా మాంజా పట్టివేత



మాంజా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తాండూరు టౌన్: పట్టణంలోని ఓ దుకాణంలో చైనా మాంజా విక్రయిస్తుండగా శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పట్టణంలో గాలి పటాలు విక్రయించే సచిన్ అనే వ్యక్తికి చెందిన షాపులో 32 ప్యాకెట్లు నిల్వ చేసిన రూ.6400 విలువైన చైనా మాంజాను స్వాధీనం చేసుకుని, యజమానిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు. నిషేధిత, ప్రమాదకరమైన చైనా మాంజాను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగ్గురి అరెస్టు.. రిమాండ్

తాండూరు టౌన్: గంజాయితో పట్టుబడిన ముగ్గురు యువకులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ తెలిపారు. శనివారం తెల్లవారు జామున స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు చేపట్టగా.. యుగేందర్, కార్తీక్, ఎండీ సమీర్ అనే ముగ్గురు యువకుల వద్ద కొన్ని గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాని పేర్కొన్నారు. అనంతరం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. సోదాల్లో ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్, ఎస్ఐలు రవికుమార్, నిజాముద్దీన్, ఎక్సైజ్ సిబ్బంది బీమయ్య, రవి, కిషోర్, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పర్మిషన్ కొంత కొల్లగొట్టేది 'కొండ'ంత

జోరుగా మట్టిదందా..
- సహజసంపద అక్రమార్కుల పాలు
- గుట్టలను పిండిచేస్తున్న వైనం
- పట్టించుకోని మైనింగ్, పోలీసు అధికారులు



నజీరాబాద్ సమీపంలో మాయమవుతున్న గుట్టలు



రూప్‌ఖాన్‌పేట్ మట్టిని తోడుతున్న జేసీబీ

పరిగి: సహజ సంపదను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. అరకొర అనుమతుల పేరిట కొండలను పిండిచేస్తున్నారు. భారీ యంత్రాల సాయంతో అందినకాడికి తవ్వి.. తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయినా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అసైన్డ్, పట్ట భూముల్లో మట్టి ఉన్నా.. రైతులకు ఎంతో కొంత ముట్టజెప్పి.. దర్జాగా దోచేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు.. అధిక లోడుతో.. పరుగులు తీస్తున్న భారీ వాహనాలతో గ్రామీణ ప్రాంత రోడ్లు దెబ్బతింటున్నాయి.

ఎడారిని తలపిస్తున్న ప్రాంతాలు

మండల పరిధి గ్రామాల్లో మట్టి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. మైనింగ్ అధికారుల నుంచి కొంతమేర అనుమతులు తీసుకుని, గ్రామ శివారులోని గుట్టల్లో ఇష్టానుసారంగా మైనింగ్‌ను యథేచ్ఛగా తరలిస్తున్నారు. దీంతో నిన్నమొన్నటి వరకు పచ్చదనంతో కళకళలాడిన గుట్టలు సైతం పిండిగా మారి.. పరిసర ప్రాంతాలు ఎడారిని తలపిస్తున్నాయి. అంతే కాకుండా.. ప్రభుత్వ స్థలం ఖాళీగా కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే మట్టిని తోడేస్తున్నారు. మండల పరిధి రంగంపల్లి, రంగాపూర్, జాపర్‌పల్లి, రూప్‌ఖాన్‌పేట్, ఇబ్రాహింపూర్, తుంకుల్‌గడ్డ, జాపర్‌పల్లి, సయ్యాద్‌మల్కాపూర్, ఖుదావన్‌పూర్, రాఘవపూర్ తదితర గ్రామాల్లోని సర్కారు, పట్టా భూముల్లో మట్టిని తోడేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మట్టిదందా జోరుగా సాగుతున్నా.. మైనింగ్, రెవెన్యూ అధికారులు, పోలీసు యంత్రాంగం కన్నెత్తి చూడటం లేదు. దీంతో ఆ అధికారులపై ఆయా ప్రాంతాల ప్రజలు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మట్టిమాఫియాతో అధికారులు చేతులు కలిపారని ఆరోపిస్తున్నారు.

అధికారుల అండతో..

అధికార పార్టీకి చెందిన నాయకులు, కొందరు అధికారుల అండతో అక్రమ మట్టివ్యాపారం చేస్తున్నట్లు ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. దందాకోసమే కొందరు.. టిప్పర్లు, జేసీబీలను కొనుగోలు చేసి.. జోరుగా వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మట్టి తరలిస్తున్న వాహనాలను ఎవరైనా పోలీసులు ఆపితే.. బడా నాయకులతో మాట్లాడించి దర్జాగా దందాను కొనసాగిస్తున్నట్లు సమాచారం.

"చర్యలు తీసుకుంటాం



అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా మట్టి తవ్వినట్లు తెలిస్తే.. సమాచారం ఇవ్వండి. ఇప్పటికే మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని సీజ్ చేసి, కేసు నమోదు చేశాం.
– ఆనంద్‌రావు, తహసీల్దార్, పరిగి

మహిళ మెడలోంచి గొలుసు చోరీ



రోదిస్తున్న బాధితురాలు అనిత

పరిగి: పరిగి బస్టాండ్‌లో గొలుసు దొంగతనాలు ఆగడం లేదు. వారం రోజుల వ్యవధిలో ముగ్గురు మహిళల మెడలో నుంచి దొంగలు బంగారు గొలుసులు అపహరించారు. తాజాగా శనివారం రాత్రి ఓ మహిళ ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ఆమె మెడలోని పుస్తెల తాడు చోరీకి గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల మండలం సాల్వీడ్‌తండాకు చెందిన అనిత పూణెలో కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. శుక్రవారం టెట్ పరీక్ష ఉండటంతో నగరంలో పరీక్ష రాసి, తండాకు వెళ్లేందుకు బస్టాండ్‌లో మహబూబ్‌నగర్ వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కుతుండా.. ఆమె మెడలోని రెండు తులాల పుస్తెల తాడును గుర్తు తెలియని దుండగుడు ఎత్తుకెళ్లాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి వచ్చి పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడి జాడ తెలియరాలేదు. అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అక్రమ మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం సీసాలతో పోలీసులు

అనంతగిరి: గోవా నుంచి అక్రమంగా రైలులో తరలిస్తున్న మద్యం సీసాలను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గోవా నుంచి సికింద్రాబాద్ వెళ్లే వాస్కోడిగామ ఎక్స్‌ప్రెస్ రైలులో శనివారం తెల్లవారు జామున పక్కా సమాచారంతో వికారాబాద్ ఎక్సైజ్ పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ సోదాలో 45 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.90వేల వరకు ఉంటుందని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంటెండ్ శ్రీనివాస్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ప్రేమ్ రెడ్డి, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో ఇరుకున్న లారీ



రోడ్డుకు అడ్డంగా మట్టిలో కూరుకుపోయిన లారీ

తాండూరు రూరల్: మండల పరిధి అల్లాపూర్ గ్రామ సమీపంలో నాపరాతిలోడ్‌తో వెళ్తున్న లారీ రోడ్డు మధ్యలో కూరుకుపోయింది. అల్లాపూర్ నుంచి కోత్లాపూర్ వరకు హైవే పనులు జరుగుతుండగా.. అల్లాపూర్ సమీపంలో ఉన్న పాలిషింగ్ యూనిట్ నుంచి ఓ లారీ నాపరాతిలోడ్‌తో రోడ్డుపైకి వచ్చి ంది. ముందుగా రోడ్డు పనుల కోసం కంకరవేశారు. ఓవర్‌లోడ్‌తో ఉండటంతో లారీ.. కంకర రోడ్డులో ఇరుక్కుంది. జేసీబీ సహాయంతో లారీని బయటకు తీశారు.

గృహిణి అదృశ్యంపై కేసు నమోదు



శిరీష (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన సంపంగి గణేష్ ఏడాది క్రితం శిరీష(21) అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి శిరీష కుటుంబ సభ్యులు ఆమెతో మాట్లాడడం లేదు. తాజాగా ఆమె తల్లితో మాట్లాడుతుంది. ఈ క్రమంలోనే ఈ నెల 9న తల్లి వద్దకు వెళ్లొస్తానని చెప్పి శిరీష బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయమై గణేష్ అత్త గారింటిలో వాకబు చేయగా, అక్కడికి రాలేదని తెలిపారు. దీంతో పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లోగాని 87126 62367 నంబర్‌లోగాని సమాచారం అందించాలని తెలిపారు.

వేడి నీళ్లు మీద పడి బాలుడు మృతి

గచ్చిబౌలి: తల్లి స్నానం కోసం పెట్టుకున్న వేడి నీళ్ల బకెట్‌ను పట్టుకోవడంతో ప్రమాదవశాత్తు నీళ్లు మీదపడి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా దోమ మండలం గొడుగోనిపల్లికి చెందిన దంపతులు మైసం రాజు, సోనీ బతుకు దెరువు కోసం వచ్చి మణికొండలోని శివపురి కాలనీలో నివాసం ఉంటున్నారు. రాజు వాచ్‌మెన్‌గా పని చేస్తూనే కారు డ్రైవింగ్ చేస్తుంటాడు. ఈ నెల 6న సాయంత్రం 4.40 గంటల సమయంలో సోనీ స్నానం చేసేందుకు బకెట్‌లో హీటర్ పెట్టి నీళ్లను వేడి చేసింది. ఆమె కొడుకు ధీరజ్ (04) ఆడుకుంటూ బకెట్‌ను పట్టుకున్నాడు. బకెట్ కిందపడటతో నీళ్లన్నీ శరీరంపై పడి బాలుడికి 60 శాతం కాలిన గాయాలయ్యాయి. వెంటనే గమనించిన తల్లి హుటాహుటిని సమీపంలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించింది. అక్కడి నుంచి నిలోఫర్‌కు వెళ్లగా ఉస్మానియా ఆస్పత్రికి పంపించారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ధీరజ్ శుక్రవారం రాత్రి 11 గంటలకు మృతి చెందాడు. వేడి నీళ్లు మీదపడి ఒక్కగానొక్క మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ట్రోఫీతో రంగారెడ్డి మహిళల జట్టు

రాష్ట్రస్థాయిలో రంగారెడ్డి సత్తా

ఖోఖో మహిళల విభాగంలో విన్నర్‌గా జిల్లా జట్టు, రన్నరప్‌గా పురుషులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్లు సత్తా చాటాయి. శనివారం రాత్రి వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో జరిగిన పోటీలో మహిళల విభాగంలో రంగారెడ్డి జట్టు విన్నర్‌గా నిలిచింది. అదేవిధంగా పురుషుల విభాగంలో రన్నరప్‌గా నిలిచి ప్రతిభ కనబర్చారు. – గీసుకొండ



రన్నరప్‌గా జిల్లా పురుషుల జట్టు

ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనం దగ్ధం



పూర్తిగా కాలిపోయిన బైకును పరిశీలిస్తున్న పోలీసులు

మాడ్గుల: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ దగ్ధమైన సంఘటన మండలంలోని ఇర్విన్ గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోవింద్ శుక్రవారం రాత్రి ఇంటి ఆవరణలో బైక్‌ను నిలిపి ఉంచాడు. మరుసటి రోజు తెల్లవారుజామున శనివారం బైక్ దగ్ధమవుతూ కనిపించడంతో కుటుంబసభ్యులు గమనించి నీళ్లు పోసి ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే పూర్తిగా అది కాలిపోయింది. దీంతో యజమాని గోవింద్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

కొడుకును తీసుకొస్తూ.. మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో తండ్రి, మరొకరు దుర్మరణం
- మైసిగండి సమీపంలో సంఘటన



భీమయ్య (ఫైల్)



వెంకటయ్య (ఫైల్)

కడ్తాల్: పండుగవేళ కుమారుడితో సంతోషంగా గడిపేందుకు ఆశపడ్డ ఆ తండ్రిని విధి వక్రీకరించింది. హాస్టల్‌లో ఉన్న కొడుకును ఇంటికి తీసుకువస్తూ రోడ్డు ప్రమాదంలో తండ్రి, సమీప బంధువొకరు దుర్మరణం చెందారు. ఈ హృదయ విదారక సంఘటన మండల పరిధిలోని మైసిగండి గ్రామ సమీపంలో చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మాడ్గుల్ మండలం ఇర్విన్ గ్రామ పంచాయతీ పరిధిలోని దిల్వార్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన బావాజీ భీమయ్య(46)కు ఇద్దరు కూతుళ్లతో పాటు కుమారుడు శివ ఉన్నాడు. కొడుకు మహేశ్వరం గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు శివను ఇంటికి తీసుకొచ్చేందుకు శుక్రవారం సాయంత్రం గ్రామానికి చెందిన సమీప బంధువు బావాజీ వెంకటయ్య(45)తో కలిసి ద్విచక్రవాహనంపై మహేశ్వరం బయలుదేరారు. ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంపై రాత్రివేళ స్వగ్రామానికి వస్తుండగా.. మార్గమధ్యలో మైసిగండి గ్రామ సమీపంలో వెనుక నుంచి వచ్చిన స్కార్పియో కారు బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో ఎదురుగా కూరగాయల లోడ్‌తో వస్తున్న బొలేరోను సైతం ఢీకొట్టడంతో బోల్తాపడింది. ప్రమాదంలో వెంకటయ్యకు తీవ్ర గాయాలై ఘటనాస్థలిలో దుర్మరణం చెందగా, బైక్‌పై ఉన్న భీమయ్య, శివలకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో కల్వకుర్తి సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ భీమయ్య మృతి చెందాడు. బాలుడికి కాలు విరిగింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు వెంకటయ్యకు భార్య యాదమ్మతో పాటు, ఇద్దరు కుమారులున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

న్యాయం చేయాలని ఆందోళన

ఇదిలా ఉంటే శనివారం మధ్యాహ్నం దిల్వార్‌ఖాన్‌పల్లికి చెందిన బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, ప్రమాదానికి కారణమైన నిందితులను అరెస్ట్ చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించారు. సుమారు అర గంట సేపు రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆందోళనకారులతో స్థానిక పోలీసులు, పలువురు నాయకులు మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.



జాతీయ రహదారిపై ధర్నా చేపట్టిన బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

గొంతు కోస్తున్న మాంజా

- నిషేధించినా గుట్టుగా విక్రయాలు
- ప్రాణాలకు ముప్పు తెస్తున్న మాయ'దారం'

షాద్‌నగర్/షాబాద్: సంక్రాంతి వచ్చిందంటే చాలు చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరు సరదాగా గాలి పటాలు ఎగురవేస్తుంటారు. ఎక్కడ చూసినా రంగు రంగుల పతంగులు గాలిలో కనిపిస్తుంటాయి. గాలిపటాలను ఎగురవేసేందుకు ఉపయోగించే చైనా మాంజా మనుషులు, జంతువులకు, పక్షులకు ముప్పు తెచ్చిపెడుతుంది. నిషేధిత మాంజాను కొందరు గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు.

తయారీ ఇలా..

చైనా మాంజాను వివిధ రకాలైన రసాయనాలతో తయారు చేస్తున్నారు. ప్రమాదకరమైన గాజు పొడి, అల్యూమినియం ఆక్సైడ్ కలుపుతారు. దారం గట్టిగా, తెగిపోకుండా ఉండేందుకు వివిధ రంగుల మిశ్రమంతో కూడిన సింథటిక్ ఫైబర్‌ను కలుపుతారు. ఎదుటి వారి పంతంగి దారాన్ని కోసేందుకు గాజు పొడి కలుపుతారు. ఈ మాంజా దారం నీరు, భూమిలో కూడా కరిగిపోదు. ఇది ఓ రకంగా కాలుష్యాన్ని సైతం పెంచుతుంది.

నూలుదారం ఎంతో మేలు

ప్రమాదకంగా ఉంటే చైనా మాంజాకు బదులుగా నూలు దారాన్ని, అన్నంతో తయారు చేసిన గంజిని ఉపయోగించవచ్చు. చెట్ల జిగురు నూలు దారానికి పై పూతగా ఉపయోగించుకోవచ్చు. ఇది ఎదుటి వారి పతంగులను తెంపేందుకు మాత్రమే ఉపయోగపడుతుంది. దీంతో వేరు నష్టం ఉండదు.

ఇటీవల ప్రమాదం

గాలిపటాల పోటీలో తెగిపడిన దారాలు చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలకు, భవనాలపై పడుతున్నాయి. వాహనాలపై వేగంగా వెళుతున్న వారికి మాంజా తగిలి గాయపడుతున్నారు. సన్నగా, దృఢంగా ఉండే ఈ దారాన్ని చేతులు, పళ్లతో తెంచే ప్రయత్నం చేస్తే ప్రమాదమే. ఇటీవల రోడ్డుపై అడ్డంగా ఉన్న మాంజా దారంతో ద్విచక్రవాహనంపై వెళుతున్న భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన ఘటన షాద్‌నగర్‌లో చోటు చేసుకుంది. ద్విచక్రవాహనం నడిపిస్తున్న భర్త రఘునాథ్ గొంతుకు మాంజా దారం తగులుతుందని గ్రహించిన భార్య సంతోషి చేతులను అడ్డంగా పెట్టింది. దీంతో ఆమె చేతులకు, రఘునాథ్ గొంతుకు గాయాలయ్యాయి.



షాబాద్‌లో పతంగులు విక్రయిస్తున్న వ్యాపారి

ఇలా చేయాలి

- గాలిపటం ఎగరేయడానికి విశాల మైదానం ఎంపిక చేసుకోవాలి.
- పిల్లలంతా కలిసి గాలిపటం ఎగురవేస్తుంటే ఎవరైనా ఒకరు వారిని పర్యవేక్షించాలి.
- తక్కువ కఠినత్వం ఉన్న మాంజా లేదా దారం ఉపయోగించినా చేతి వేళ్లకు బట్ట, గౌజ్‌లు వేసుకుంటే గాయం నుంచి తప్పించుకోవచ్చు.
- విద్యుత్ తీగలు, భవనాలు, వృక్షాలు.. ఇలా ఎత్తైన ప్రదేశాల్లో పడిన గాలిపటాల కోసం వెళ్లడం మానుకోవాలి.
- పతంగి ఎగురుతున్న సమయంలో ఎటూ చూసుకోకుండా పరుగెడుతూ గుంతలు, కాల్వల్లో పడకుండా వాటిని వదిలేయడం మంచిది.
- పెద్దవి ఫ్యాన్సీ రకం గాలిపటాలకు బదులు తేలికపాటివి వినియోగించేలా చూడాలి.

జాగ్రత్తలు

- తల్లిదండ్రులు తమ పిల్లలను నిత్యం కనిపెడుతూ ఉండాలి.
- భవనాలు, గోడలు, బాల్కనీలపై నుంచి గాలిపటాలు ఎగరేయొద్దు. గాలి వీచిన దిక్కు పతంగి ఎగురుతుంది. దానిపైనే శ్రద్ధ పెట్టి నడిస్తే పడిపోయే ప్రమాదం ఉంది.
- గల్లీలు, భారీ భవన సముదాయాలు, విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్ల సమీపంలో గాలి పటాలు ఎగరేసే సాహసం చేయొద్దు, పతంగి విద్యుత్ తీగలు, స్తంభాలు, వృక్షాలపై పగిలితే తీసుకునే ప్రయత్నం చేయొద్దు. గాలి పటాన్ని తీసుకునే ప్రయత్నంలో ప్రమాదాలకు గురవుతున్నారు.

గాలిపటాల దుకాణాలపై తనిఖీలు

చేవెళ్ల: గాలిపటాలు ఎగురవేసేందుకు చైనా మాంజాని ఉపయోగించటం నేరమని చేవెళ్ల ఎస్ఐ సంతోష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పలు దుకాణాలలో చైనా మాంజాలను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్ ఆదేశాలతో పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మూడు దుకాణాలపై చైనా మాంజాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిషేధిత చైనా మాంజాతో ప్రకృతిలో ఉండే పక్షులు, ఇతర ప్రాణులతో పాటు మనుషులకు ప్రాణహాని కలిగిస్తాయన్నారు. గతంలో పలు సంఘటనలు చోటు చేసుకోవటంతో ప్రభుత్వం దీనిపై నిషేధం విధించిందన్నారు. చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

"చైనా మాంజా నిషేధం



గాజు పొడి, సింథటిక్‌తో తయారు చేసిన చైనా మాంజాను విక్రయించడం చట్టవిరుద్ధం. నిబంధనలు అతిక్రమించి మాంజాను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు.
– విజయ్‌కుమార్, సీఐ, షాద్‌నగర్

మెటాలిక్ మాంజాలతో ముప్పు



మెటాలిక్ మాంజాలకు కరెంట్ పాస్ అవుతుంది. అవి విద్యుత్ తీగలపై పడితే షాక్ కొట్టే ప్రమాదం ఉంది. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పతంగులు ఎగురవేయొద్దు.
– వినోద్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ, షాద్‌నగర్